క్లుప్తంగా

టేక్మాల్ తహసీల్దార్‌గా కృష్ణ



టేక్మాల్(మెదక్): మండల తహసీల్దార్‌గా జి.కృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు టేక్మాల్ తహసీల్దార్‌గా పనిచేసిన మల్లయ్య రేగోడ్ మండలానికి బదిలీ అయ్యారు. రేగోడ్ మండలానికి బదిలీ కాగా రేగోడ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కృష్ణ టేక్మాల్‌లో బాధ్యతలు చేపట్టారు.

నాయీ బ్రాహ్మణ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో నాయీ బ్రాహ్మణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం నాయీ బ్రహ్మణ అధ్యక్షుడిగా ముత్యాల రమేశ్, ఉపాధ్యక్షుడు ముత్యాల లక్ష్మీ నర్సింహ, కార్యదర్శి ముత్యాల స్వామి, క్యాషియర్ ముత్యాల రాము, సలహాదారు యాదగిరి, సంఘం సభ్యులు ముత్యాల శంకర్, ముత్యాల బల్దాసు, ముత్యాల పర్వారాములు, ముత్యాల యాదగిరి, ముత్యాల శ్రీకాంత్, ముత్యాల స్వామి, ముత్యాల బాలకృష్ణ, ముత్యాల శివకృష్ణ, ముత్యాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న గ్రామ పంచాయతీ పాలకవర్గం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోండాపూర్ గ్రామంలో ఐటీసీ పరిశ్రమ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతల మమత మాట్లాడుతూ.. గ్రామస్తుల కోరిక మేరకు ఐటీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులలో భాగంగా రూ. 12 లక్షలతో భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకట్, వార్డు సభ్యులు బాబు, యాదగిరి, నాయకులు సత్యనారాయణ, రవి, కార్యదర్శి శ్రీధర్, ఐటీసీ సంస్థ ప్రతినిధులు తదితరులున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: పంట దిగుబడులు ఆశించిన విధంగా రావాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి చేయించుకోవాలని కౌడిపల్లి మండలం తునికిలోని డి. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం నాలుగో సంవత్సరం అగ్రికల్చర్ విద్యార్థులు రైతులకు సూచించారు. మంగళవారం నరసాపురం మండలం రామచంద్రపుర్‌లో భూసార పరీక్షలు, పంట సాగు, సమగ్ర సస్యరక్షణ, సేంద్రియ ఎరువులు వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్, విద్యార్థులు మౌనిక, భాగ్యలక్ష్మి, భూమిక, శరణ్య, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

బస్సు వచ్చేలా చూడండి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కొండాపూర్ గ్రామానికి మేడ్చల్ డిపో నుంచి వచ్చే బస్సు సమయానికి వచ్చేలా చూడాలని డిపో మేనేజర్‌ను కలిసి గ్రామస్తులు కోరారు. మంగళవారం గ్రామానికి చెందిన పలువురు డిపో మేనేజర్‌ను కలిసి కొండాపూర్‌కు వచ్చే బస్సు సమయానికి రావడం లేదని, విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోయారు. ఎప్పటిలాగే బస్సు వేళకు వచ్చేలా చూడాలని కోరినట్లు తెలిపారు.

వామ్మో.. గ్రామ సింహాలు

- గ్రామాల్లో దడపుట్టిస్తున్న వీధి కుక్కలు
- భయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఎల్కపల్లిలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ ఎక్కువ అవుతోంది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వెల్దుర్తి, చెర్లపల్లి, ఎల్కపల్లి, మాసాయిపేట, శెట్టిపల్లి, రామాయిపల్లి, అందుగులపల్లి, మంగళపర్తి, కుకునూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో ఎక్కడ చూసిన గుంపులు గుంపులుగా కుక్కలు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో రోడ్ల వెంట నడుచుకుంటూ వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఇక ప్రయాణికులకు చుక్కలు చూపుతున్నాయి.

కోళ్ల వ్యర్థాల పారబోతతో ఇబ్బందులు

పౌల్ట్రీ ఫాంలలో చనిపోయిన కోళ్లను వాటి నిర్వాహకులు ఎక్కువ శాతం రోడ్ల పక్కన పారబోస్తున్నారు. చికెన్ షాపు నిర్వాహకులు కూడా దుకాణాల్లోని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు. వీటిని తినేందుకు కుక్కలు గుంపులుగా పోటీపడుతున్నాయి. ఒక్కోమారు వెంటాడి వేటాడి మరి దాడి చేస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిపై పంచాయతీల్లో అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోజూ భయపడుతున్నాం



వీధి కుక్కల స్వైర విహారంతో రోజూ భయపడుతున్నాం. కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. బైక్‌ల వెంట కూడా పడుతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– రవి, ఎల్కపల్లి, గ్రామస్తుడు

ఇబ్బందులు పడుతున్నాం



రోడ్లపై కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో ఆ దారిగుండా ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది. చిన్న పిల్లలను రోడ్లపైకి పంపించే అవకాశం లేకుండా ఉంది.

– రమేశ్, శెట్టిపల్లి, గ్రామస్తుడు

పల్లెల్లో పోలింగ్ బూత్‌ల పరిశీలన



జూకల్‌లో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పాత నంబర్లపై తెలుపు రంగు వేయించారు. త్వరలోనే అన్ని పోలింగ్ బూత్‌లకు కొత్తగా నంబర్లు వేయిస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రవీందర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో తహసీల్దార్ గ్రేస్‌బాయి మంగళవారం వసతులను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జూకల్, దానంపల్లి, ముసాపేట, మక్తలక్ష్మాపూర్, బూర్గుపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ఇతర వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరణప్ప, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, బీఎల్ఓలున్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీని తీసేయిస్తున్న ఎంపీడీఓ శశిప్రభ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో మండలంలోని ఆయా గ్రామాల కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించామని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. మంగళవారం ఆమె చిలప్‌చెడ్ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే ఓ పార్టీకి చెందిన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పంచాయతీ కార్మికులతో తొలగించామని తెలిపారు.

మామిళ్లపై కాంగ్రెస్ నేతల ఫైర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మెదక్: పీసీసీ కో ఆప్షన్ సభ్యుడు మామిళ్ల ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడంతో కాంగ్రెస్‌కు పట్టిన శని పోయిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్, పవన్, జీవన్ రావు పేర్కొన్నారు. మంగళవారం మెదక్‌లో వారు విలేకర్లతో మాట్లాడుతూ.. బీ ఫామ్ ఇచ్చి మామిళ్ల ఆంజనేయులును కౌన్సిలర్ చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు టికెట్ అమ్ముకునే పార్టీలో ఇన్నాళ్లు ఎలా పని చేశావని అన్నారు. ఊసరవెల్లి రాజకీయాలు మామిళ్లకు బాగా వంటపట్టాయని విమర్శించారు. ముదిరాజ్‌లకు ఒక్క టికెట్ కూడా ఇవ్వని బీఆర్ఎస్ పార్టీకి ఒక ముదిరాజ్‌గా ఎలా వెళ్తున్నవని అన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు తిమ్మన్న గారి అనిల్ కుమార్ శేఖర్, అయితారం నర్సింలు, ఇస్మాయిల్, కండెల సాయిలు, పవన్, కృష్ణ, గోపాల్, తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన ఆశా సిబ్బంది



వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

శివ్వంపేట(నర్సాపూర్): 15 రోజులుగా సమ్మె చేసిన ఆశా సిబ్బంది మంగళవారం విధుల్లో చేరారు. ఆశా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి 15 రోజులు సమ్మె బాట పట్టారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటు చేస్తామని హెల్త్ డైరెక్టర్ హామీ ఇచ్చారు. అందులో భాగంగా విధుల్లో చేరుతున్నట్లు ఆశా సిబ్బంది ప్రకటిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సాయిసౌమ్యకు వినతిపత్రం అందజేశారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది



నర్సాపూర్‌లో విగ్రహాలకు ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్: ఎన్నికల కోడ్ కూయడంతో పలువురు ప్రముఖుల విగ్రహాలపై ముసుగు వేశారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు ప్రముఖులు, రాజకీయ నాయకుల విగ్రహాల ముఖాలు కన్పించకుండా ముసుగు వేయాల్సి ఉంటుంది. కాగా పట్టణంలోని పిల్లల పార్కులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి జగన్నాథరావు తదితరుల విగ్రహాలు ఉన్నాయి. దీంతో మంగళవారం మున్సిపల్ అధికారులు విగ్రహాలకు ముసుగు వేయడంతో పాటు పట్టణంలోని గోడలపై ఉన్న ఆయా రాజకీయ పార్టీల పోస్టర్లను, ఫ్లెక్సీలను, బ్యానర్లను తొలగించారు. ఆయా పనులను మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ పర్యవేక్షించారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శశిధర్ శర్మ బదిలీలో భాగంగా మంగళవారం వర్గల్ మండలం చౌదరిపల్లి పాఠశాలకు వెళ్లారు. దీంతో విద్యార్థులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్ఎం రహీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): మండలంలోని చౌదరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అదరాసుపల్లి శశిధర్‌శర్మకు ఆ సంఘం వర్గల్ మండల బాధ్యులు, ఉపాధ్యాయులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ఈయన జగదేవపూర్ మండలంలో పనిచేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ వర్గల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగు తీసివేత

సాక్షి ఎఫెక్ట్



విగ్రహాలకు ముసుగు తీస్తున్న పంచాయతీ సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో మహనీయుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన మహనీయుల స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, పటేల్ విగ్రాహాలకు ముసుగులు వేసిన కథనంపై తహసీల్దార్ స్పందించారు. వాటిని తొలగించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు మేలు కలిగేలా ఉన్న విగ్రహాలకు మాత్రమే ముసుగు వేస్తామని వివరించారు.

ఆమరణ నిరాహార దీక్ష విరమణ

జేఏసీ డిమాండ్లు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ హామీ



ఆమరణ దీక్షను విరమింప చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం రెవెన్యూ డివిజన్ సాధన కోసం 44 రోజులుగా చిల్వెర ఐబీ చౌరస్తాలో సాధన జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ దీక్షలకు ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సోమవారం జేఏసీ నాయకుడు బ్రహ్మం అమరణ నిరహార దీక్ష చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మంగళవారం దీక్ష శిబిరానికి చేరుకొని ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన బ్రహ్మంతో నిమ్మరసం తాగించి దీక్ష విరమింప చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జేఏసీ డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. అల్లాదుర్గంకు మంజూరైన బీసీ గురుకుల పాఠశాల మరో ప్రాంతంలో కొనసాగుతుందని, ఇక్కడే భవనం ఉంటే ఏర్పాటు చేయిస్తామన్నారు. ఎస్‌టీఓ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, జేఏసీ నాయకులు రాములు, మూసా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు



మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడుతున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో నివాసంలో మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మనోహరాబాద్ మండల సమస్యలు, పార్టీ స్థితిగతులపై మాట్లాడినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ కోసం అందరు కలిసికట్టుగా పని చేయాలని, మంత్రి సూచించారని చెప్పారు. వీరి వెంట పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పెంటాగౌడ్, లక్ష్మారెడ్డి, మల్లేశ్, చందుగౌడ్, ఉప సర్పంచ్‌లు నవీన్‌చారి, శ్రీహరిగౌడ్ ఉన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి



నర్సాపూర్: మాట్లాడుతున్న గోపి



నర్సాపూర్ రూరల్: మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

నర్సాపూర్: పట్టణంలో బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.గోపి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని పార్టీ శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పట్టణంలో పార్టీ బలోపేతం చేసేందుకు అందరు సమిష్టిగా పని చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సురేశ్, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజ్, రాంరెడ్డి, ప్రేంకుమార్, రాంప్రసాద్, గుండం శంకర్, దిగంబర్, సంగమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి శక్తి కేంద్రం, గ్రామస్థాయి కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా ఓబీసీ అధ్యక్షుడు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కాగజ్ మద్దూర్‌లో నత్నయ్యపల్లి, కొండాపూర్ శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, గ్రామస్థాయి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శిలు నీలి అశోక్, అశోక్ గౌడ్, బీజేవైఎం నాయకుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత

మెదక్ కలెక్టరేట్: ఆశా వర్కర్లు చేసిన సమ్మెకు ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు హామీ ఇచ్చిందని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. నర్సమ్మ తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని కెవల్ కిషన్ భవనంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా పని చేస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వకుండా ఇప్పటివరకు ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందన్నారు. డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్స్ చేపట్టిన సమ్మెలో భాగంగా ఈనెల 9న చలో హైదరాబాద్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్‌తో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చినట్లు వివరించారు. దీంతో సమ్మె తాత్కాలికంగా విరమించినట్లు చెప్పారు. సమ్మెకు సహకరించిన పాత్రికేయులకు, ప్రజలకు, ప్రజాసంఘాలకు, పోలీసులకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సావిత్రి, రాణి, రాములమ్మ, స్వప్న, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్



మాట్లాడుతున్న రామచందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచందర్‌గౌడ్ అన్నారు. రామాయంపేటలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరిని ప్రలోభాలకు గురి చేస్తూ బీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ నుంచి గెలిచిన మామిళ్ల ఆంజనేయులు పార్టీపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగులు, పార్టీ జిల్లా కార్యదర్శులు బైరం కుమార్, విప్లవ్‌కుమార్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు తార్యానాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్, ఎస్సీ సెల్ ప్రతినిధి కిషన్, ఝాన్సి లింగాపూర్, అక్కన్నపేట, పర్వతాపూర్, కిషన్‌తండా పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బాధితులకు పరామర్శ



నర్సాపూర్ రూరల్: పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ మాజీ వార్డ్ మెంబర్ కిషన్ నాయక్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తుజాల్ పూర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న గాలి రాములు, అదే గ్రామానికి చెందిన రాములుగౌడ్‌ను సైతం పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుధీర్ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): మండలంలోని బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

◆ ఆర్థికసాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సంద్రు నర్సింలు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకుల ద్వారా అందించారు.

◆ ఆలయంలో పూజలు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ కృష్ణ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



హవేళిఘనాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై పురుగుల మందు సేవించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గాంధీ ఆస్పత్రిలో మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన పొద్చన్‌పల్లి బాబు(36) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో సోమవారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగి ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు మెదక్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

◆ నియామకం



పాపన్నపేట(మెదక్): మెదక్ జిల్లా కాంగ్రెస్ మాజీ సైనిక విభాగం అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్‌ను నియమిస్తూ ఏఐసీసీ మాజీ సైనిక విభాగం అధ్యక్షుడు కల్నల్ రోహిత్ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. పాపన్నపేట మండలం లక్ష్మీనగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ సైనికుడిగా పదవీ విరమణ చేశారు. అనంతరం 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని దుర్గాప్రసాద్ తెలిపారు.

◆ ఆరోపణల్లో నిజం లేదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లో గృహలక్ష్మీ పత్రాల పంపిణీ అనంతరం గృహలక్ష్మీ పథకం రాని మహిళలు ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీని నిలదీశారు. గ్రామ ప్రజాప్రతినిధులకు మాత్రమే గృహలక్ష్మీ మంజూరు చేశారని ఆరోపించగా మంగళవారం ఎంపీటీసీ కవితా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ కుటుంబంలో ఎవరికీ గృహలక్ష్మీ పథకం రాలేదని, సదరు మహిళలు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు.

◆ ఉచిత వైద్యశిబిరం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లి గ్రామంలో మంగళవారం ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సర్పంచ్ నీల మల్లేశం మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.